క్లుప్తంగా

కార్పొరేట్‌ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నిబంధనలు అమలు చేయకుండా సెలవుదినాల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్‌ కుమార్‌ పేర్కొన్నారు. మంగళవారం విద్యాశాఖ ఆదేశాలను లెక్కచేయకుండా సంక్రాంతి సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్న వాటిని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అడ్డుకున్నారు. సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తుంటే తనిఖీలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు నిద్ర పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుక్కే సురేష్‌ నాయక్‌, విహారి, యశ్వంత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది నియంత పాలన

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద, నియంత పాలన చేస్తున్నారని ఏపీసీసీ మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్‌ అలీ ఖాన్‌ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ సమాజాన్ని హిందూ ముస్లింలుగా విభజించి మతవిద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్‌ రహమతుల్లా ఖాన్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సన్మానం



బత్తల లింగమూర్తిని సత్కరిస్తున్న ఏపీజీబీ ఉద్యోగుల అసోసియేషన్‌ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ అసోసియేషన్‌ నాయకులు మంగళవారం ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు అధికారిగా పదవీ విరమణ పొందిన బత్తల లింగమూర్తి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, జ్యోతిరావు పూలే సేవారత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ జనరల్‌ సెక్రెటరీ మహమ్మద్‌, ఓబీసీ ఎంప్లాయిస్‌ యూనియన్‌ జనరల్‌ సెక్రెటరీ వెంకటరమణ, ఓబీసీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ మధుసూదన్‌ రాహుల్‌ తేజ్‌, రవి, మనోజ్‌ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్‌ : కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్‌ కళాశాలలో బీటెక్‌ చివరి సంవత్సరం, 2024లో ఉత్తీర్ణులైన సివిల్‌, మెకానికల్‌, ఈఈఈ చదువుతున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్‌ వీఎస్‌ఎస్‌ మూర్తి తెలిపారు. హైదరాబాదుకు చెందిన బహుళ జాతీయసంస్థ అయిన మేఘా ఇంజనీరింగ్‌ అండ్‌ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ లిమిటెట్‌ నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికల్లో సివిల్‌ విభాగంలో 43 మందికి, ఈఈఈలో ముగ్గురికి, మెకానికల్‌లో 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్‌ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి నాడు చేసిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా చెన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వైఎస్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌ యాదవ్‌

కడప కార్పొరేషన్‌ : సామాజిక న్యాయ మహా శిల్పం డా. బీఆర్‌ అంబేడ్కర్‌ స్మృతి వనం ఆవిష్కరణ కార్యక్రమాన్ని దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌ యాదవ్‌ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సాఆర్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ వినోద్‌కుమార్‌ ఆధ్వర్యంలో వాల్‌ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధానత్య ఇస్తూ రాజ్యాధికారం దిశగా వారిని చేయిపట్టి నడిపిస్తున్నారన్నారు. డా. బీఆర్‌ అంబేడ్కర్‌ కన్న కలలను నిజం చేసేలా పాలన సాగిస్తున్నారన్నారు. అంబేడ్కర్‌ ఆశయాల సాధనకు కృషి చేయడంలో భాగంగా ఈనెల 19వ తేదీ ఆయన 125 అడుగుల మహా శిల్పాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేయబోతున్నారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని అంబేడ్కర్‌ వాదులంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌ రెడ్డి, ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ బోర్డు ఛైర్మెన్‌ పులి సునీల్‌, బండి ప్రసాద్‌, లక్ష్మినారాయణ, శ్రీరాములు, ప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌ సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక సేవల్లో 'నందారపు' కృషి ప్రశంసనీయం



మాట్లాడుతున్న స్వామి విరజానంద

కడప కల్చరల్‌ : గో సంరక్షణ, హిందూ ధర్మ రక్షణ, ఆలయాల పరిరక్షణ తదితర సేవల్లో నందారపు చెన్నకృష్ణారెడ్డి సేవలు ప్రశంసనీయమని బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి అన్నారు. మంగళవారం శ్రీ లలితా పంచాయతన ఆలయ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, యానాం హిందూ ఉపాధ్యాయ సమితి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. హిందూ ధర్మ రక్షణ కోసం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ సొంత ఖర్చుతో ధార్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటాన్ని స్వామిజీ ప్రశంసించారు. హిందూ ఉపాధ్యాయ సమితి ప్రముఖులు డేగల మహేష్‌, సమ్మెట శశిధర్‌ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన సేవలను గుర్తించి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్‌బోర్డు రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, అచ్చోలు ముకుందారెడ్డి, నర్రెడ్డి విశ్వనాథరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కడప కార్పొరేషన్‌ : మున్సిపల్‌ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం కడప నగరంలో కార్మికులు ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, కోటిరెడ్డి సర్కిల్‌లో దహనం చేశారు.

ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ గౌరవాధ్యక్షులు కేసీ.బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు మాట్లాడుతూ సమ్మె వల్ల ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని, ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్స్‌ పరిష్కరించి సమ్మెను విరమింప చేసే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు గోవిందు, ఈశ్వరయ్య, చంద్ర, జాన్‌, వెంకటాద్రి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక పటంలో గండికోట



గండికోట ఫోటోలను ఆవిష్కరిస్తున్న పర్యాటక సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్‌ : ప్రపంచ పర్యాటక పటంలో గండికోటకు శాశ్వతస్థానం లభించిందని వక్తలు అన్నారు. గండికోట 901వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ప్రభుత్వ పురుషుల కళాశాల పర్యాటక విభాగం, రాయలసీమ టూరిజం అండ్‌ కల్చరల్‌ సొసైటీ ఉమ్మడిగా ఆర్ట్స్‌ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంటాక్‌ జిల్లా చాప్టర్‌ కన్వీనర్‌ లయన్‌ చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఒబెరాయ్‌ లాంటి హోటళ్లు గండికోటకు వస్తున్నాయని, ఇది జిల్లాకు గర్వకారణం అన్నారు. గండికోట రాజ వంశీకులు పెమ్మసాని ప్రభాకర్‌ నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి గండికోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం హర్షణీయమన్నారు. కోటలో రక్షణ పరంగా గట్టి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రధాన వక్త, వేంపల్లె డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్‌, కళాశాల పర్యాటక విభాగాధిపతి శివపార్వతి, రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, ప్యాట్రన్‌ పద్మప్రియ చంద్రారెడ్డి తదితరులు మాట్లాడుతూ గండికోటకు యునెస్కో గుర్తింపు వస్తే జిల్లాకు ప్రపంచ స్థాయిలో పేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా గండికోటకు సంబంధించిన ఫొటోలను అతిథులు ఆవిష్కరించారు.

కలెక్టరేట్‌ వద్ద ధర్నా

కడప ఎడ్యుకేషన్‌ : రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో యూటీఎఫ్‌ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ మంగళవారం యూటీఎఫ్‌ నాయకులు కడప కలెక్టరేట్‌ వద్ద నిరసన ధర్నాను నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని ప్రజాస్వామ పద్ధతిలో పోరాటం చేస్తున్న యూటీఎఫ్‌ ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్‌, జిల్లా ట్రెజరర్‌ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

12న మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు

చెన్నూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా భారత జాతీయ వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ(ఇంటాక్‌) ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు చెన్నూరులో మహిళలకు పలు అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్‌ లయన్‌ కె. చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గులు పోటీలు, మ్యూజికల్‌ చైర్‌, టక్‌ ఆఫ్‌ వార్‌ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. అదే రోజు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు తమ పేర్లను ఫోన్‌ నెంబర్‌ 6305248077లో 11వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : రక్తదానం ప్రాణదానంతో సమానమని కడపకు చెందిన దంతవైద్యులు డాక్టర్‌ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ ఏర్పాటై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాష, సంగమేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి 75 వసంతాల సందర్భంగా 75 మంది రక్తదానం చేశారు.

అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్‌ శ్రీధర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. రక్తదానం చేసిన 75 మంది ఎస్టీయూ నాయకులకు, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, అసోసియేట్‌ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్‌, ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలి



ఉత్తమ ఉద్యోగులతో డిపో మేనేజర్‌ డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీ కడప డిపోలో ఉత్తమ ఉద్యోగులుగా విశేష సేవలు అందిస్తున్న వారిని ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని కడప డిపో మేనేజర్‌ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. డిపోకు చెందిన కండక్టర్లు ఎంవీ ప్రతాప్‌, అంకయ్య, డ్రైవర్‌ రవిశేఖర్‌రెడ్డి విధి నిర్వహణలో మెలకువలు పాటిస్తూ సంస్థకు అధిక ఆదాయం తీసుకురావడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రబీ సాగుకు ఈ-కేవైసీ తప్పనిసరి



బొగ్గిడివారిపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న బద్వేల్‌ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ - కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని బద్వేల్‌ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్బీకేలో పలు రికార్డులను పరిశీలించారు. అంతేగాకుండా బొగ్గిడివారిపల్లికి చెందిన రైతు శివరామిరెడ్డి సాగుచేసిన మిరప పంటను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో 30 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. బస్తా ధర రూ. 266.50పైసలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తీసపుకోవచ్చునన్నారు. పంటల్లో జిగురు పూసిన పసుపు తెలుపు పల్లాలు రసం పీల్చు పురుగుల నివారణకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుతం మిరపలో ముడత రోగం (తామర పురుగు)వచ్చిందని దీని నివారణకు సయాట్రా నిలిప్రోల్‌ (కొరజిన్‌)ఒక లీటరు నీటికి 0.6 మిల్లీ లీటర్‌ల నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం రబీలో వరి, వేరుశనగ, నువ్వులు, దోస పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు క్షేత్ర స్థాయి పర్యటనలో తెలిసిందని ఆయన అన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్‌

వైవీయూ : లాభదాయకమైన వనరు పుట్టగొడుగుల పెంపకమని వైవీయూ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూ బయోటెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో 'మిల్కీ మష్రూమ్స్‌' (కలోసైబ్‌ ఇండికా) సాగు అన్న అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్‌ విశ్వవిద్యాలయంలోని సర్‌ సీవీ రామన్‌ సైన్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. వర్క్‌షాప్‌ కన్వీనర్‌ ఆచార్య పి. చంద్రమతీశంకర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో వీసీ మాట్లాడారు. దేశంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పంటసాగుకోసం వెచ్చించిన సొమ్ము రావడమే గగనమైపోతున్న తరుణంలో తక్కువ సమయం, పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు పుట్టగొడుగుల పెంపకం సరైనదన్నారు. పుట్టగొడుగుల్లో అధికస్థాయిలో ప్రొటీన్లు, న్యూట్రీయన్స్‌, కార్బొహైడ్రేడ్లు, ఖనిజలవణాలు, అమైనోఆమ్లాలు ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి మాట్లాడుతూ మాంసాహారానికి ప్రత్యామ్నాయంగా పుట్టగొడుగుల పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ విస్తీర్ణంలో వీటిని సాగుచేయవచ్చన్నారు. కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. వి. శిల్పకళ, గుంటూరు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. ఎం. గంగాదేవి, ఎస్‌బీఐ రీజినల్‌ బిజినెస్‌ ఆఫీస్‌ చీఫ్‌ మేనేజర్‌ పి.వి. ఆనంద్‌కుమార్‌, వర్క్‌షాప్‌ కన్వీనర్‌ ఆచార్య పి.చంద్రమతీశంకర్‌ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ వైవీయూశాఖ మేనేజర్‌ సుధాకర్‌, వర్క్‌షాప్‌ కో కన్వీనర్‌ ఎ. చంద్రశేఖర్‌, అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష పరిశీలనతో ప్రయోజనం

విద్యార్థులు క్షేత్రపర్యటనల్లో ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా ప్రయోజనం మెండుగా ఉంటుందని వైవీయూ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ పేర్కొన్నారు. వైవీయూ ఎంబీఏశాఖ విద్యార్థులు క్షేత్రపర్యటనకు పులివెందుల గోవిందరాజ టెక్స్‌టైల్స్‌ పరిశ్రమకు పయనమవగా, వీసీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డా. అమృత్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన

కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్షశాస్త్ర విభాగాధిపతి అధ్యాపకుడు డా. పి. సుబ్రమణ్యం మాట్లాడుతూ పుట్టగొడుగుల తయారీ, నిల్వ పద్ధతులు, మార్కెటింగ్‌ తదితర అంశాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు.

విద్యతోనే దేశాభివృద్ధి



కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: షేక్‌ ఫాతిమా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: విద్యతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆప్‌ కి ఆవాజ్‌ రాష్ట్ర కార్యదర్శి మక్బుల్‌ బాష పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్‌ కార్యాలయంలో ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్‌ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు ఆశ్రయం ఇచ్చి ఆ ప్రాంతాల్లో ఉన్న పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్య నేర్పించడం కోసం ఎంతో శ్రమించిన వ్యక్తి ఫాతిమా షేక్‌ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్‌ కీ ఆవాజ్‌ నగర అధ్యక్షులు అబిద్‌ హుస్సేన్‌, మున్నా, ఆరిఫ్‌, చాంద్‌ బేగం, కరిముస్‌, సౌకత్‌ ఆలీ, తస్లీమ్‌ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్‌ : ముస్లింలలో ప్రథమ ఉపాధ్యాయురాలు అయిన షేక్‌ ఫాతిమా జయంతి మంగళవారం కడపలో జేకే జనం కోసం యూత్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప కో ఆపరేటివ్‌కాలనీకి చెందిన ఉత్తమ ఉపాధ్యాయురాలైన రహిమున్నీసాను ప్రముఖ కవి సత్తార్‌ ఫైజీ, జేకే జనం కోసం వెల్ఫేర్‌ సొసైటీ వ్యవస్థాపకులు లయన్‌ ఫటాన్‌ ఖాదర్‌బాషలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాజుద్దీన్‌, సిరాజుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ విడుదల



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్‌ : ఆంధ్రప్రదేశ్‌ పంచాయతీరాజ్‌ మినిస్ట్రీరియల్‌ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షుడు బాలయ్య, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, మినిస్ట్రీరియల్‌ ఉద్యోగ సంఘ నాయకులు ఆర్‌.నాగిరెడ్డి, లంకా మల్లేశ్వర్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి వంటి మహనీయుల కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయాలని వివిధ సంఘాల నాయకులు మంగళవారం జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమర్‌నాథ రెడ్డిని కోరారు. జెడ్పీ చైర్మన్‌ స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్‌ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా నాయకుడు భాస్కర్‌ రెడ్డి, రెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పద్మప్రియ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



డ్రోన్‌లో నానో యూరియా పోస్తున్న అధికారులు

కమలాపురం : పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ పద్మలత తెలిపారు. మంగళవారం లేటపల్లెలో జరిగిన వికసిత భారత్‌ కార్యక్రమంలో ఆమె రైతులకు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. రైతుల శ్రేయస్సును కోరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ఆదాయం సాధించవచ్చన్నారు. ఊటుకూరు కేవీకే శాస్త్రవేత్త సాయి కిరణ్మయి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, మెలకువలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు డ్రోన్‌లను సబ్సిడీపై అందిస్తుందన్నారు. డ్రోన్‌ల ద్వారా పెస్టిసైడ్స్‌ సులభంగా తక్కువ సమయంలో పిచికారి చేసుకోవచ్చన్నారు. కమలాపురం ఏఓ సరస్వతి మాట్లాడుతూ కమలాపురంలో 110 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని, పూర్తి ధర చెల్లించి రైతులు తీసుకుంటే 50 శాతం సబ్సిడీ రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు క్రాప్‌ బుకింగ్‌, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అలాగే పెద్దచెప్పలిలో జరిగిన వికసిత భారత్‌లో సర్పంచ్‌ నామాల చంద్రలీల, ఎంపీడీఓ జ్యోతి, ఈఓఆర్‌డీ శారదా రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. వికసిత భారత్‌ పోస్టర్లు విడుదల చేశారు. వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరులో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : రాష్ట్రంలో వున్న సగటు పేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవడమే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం 100 శాతం హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చిన జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం మనందరిపై వుందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న పెన్షన్‌ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఒక లక్షా 65 వేల కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేశాడన్నారు. ఇచ్చిన మాట మేరకు పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి మాట నిలుపుకున్నారన్నారు. గతంలో చంద్రబాబు వేలాది హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలకు 28 వేల కోట్లను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పసుపు కుంకుమ పేరుతో వడ్డీలకు కూడా సరిపోని విధంగా కేవలం రూ.5 వేల కోట్లను మంజూరు చేసి మహిళలను వంచించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక విధంగా ప్రజలను తిరిగి మభ్యపెట్టి అధికారాన్ని చేజిక్కించుకుని ప్రజా ధనాన్ని దోచుకోవడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మోసగించడానికి సిద్ధమవుతున్నాడని, ప్రజలు అప్రమత్తంగా వుండి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నంతరం లబ్ధిదారులకు పెంచిన పెన్షన్‌లను, నూతనంగా మంజూరైన పెన్షన్‌లను పంపిణీ చేశారు.

అనంతరం మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ సచివాయ పరిధిలో 8 మందికి, దిగువపల్లె గ్రామ సచివాలయాల పరిధిలోని 15 మందికి మంజూరైన ఇంటి స్థలాల పట్టాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు గంగయ్య, ఎంపీడీవో జయశ్రీ, తహసీ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌, ఎంఈవో లిల్లెమ్మ, సర్పంచ్‌లు కుళాయప్ప, శ్రీనివాసులురెడ్డి, రాజన్న, ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీలు రామ కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌ రెడ్డి, హరికేశవరెడ్డి, మునీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ డా. వి. సలీంబాషా

వైవీయూ : స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకుని తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో స్వామి వివేకానందుని చిత్రపటంతో కూడిన క్యాలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. గురు మోహన్‌రెడ్డి, ఆర్‌.కె. సేవాసమితి అధ్యక్షుడు అబ్దుల్‌ కరీముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో మంగళవారం అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. అర్చకులు సూర్య నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో రామ భక్తులు పెద్దపుత్త గ్రామంతో పాటు స్థానిక దళితవాడ, అరుంధతి వాడల్లో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈనెల 22వ తేదీన సాయంత్రం ఇంటి ముందు దీపాలను వెలిగించి దీపోత్సవాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.